

# గ్రాడ్యుయేట్ పెళ్ళాం

వి. సుబ్బారావు

గేటు తలుపు త్రోసుకు వచ్చిన సుబ్బలక్ష్మి ఉరమని పిడుగులా ఊరినుంచి ఊడిపడ్డ బామ్మని చూసి ఆశ్చర్యపడి "హాయ్ బామ్మా! ఎప్పుడొచ్చావు," అంటూ ఆవిణ్ణి పలుకరిస్తూ లోపలకి నడిచింది.

చేతిలో పుస్తకాలు రాక్‌లో పడేసి, బామ్మ

హఠాత్తుగా ఊడిపడ్డానికి కారణం ఆలోచిస్తూ ఉదయ్ తీసుకుని జాతకం వైపు నడిచింది.

అప్పుడే సెకండియర్ పరీక్షలయిపోవడంతో, తలమీద నుంచి పెద్ద బరువు దిగిపోయినట్టు, రిలీఫ్ ఫీలవుతూ, సినిమాకి వెళ్ళడానికి టాయిలెట్ అవసాగింది సుబ్బలక్ష్మి సెకండ్ బి. ఏ.

"సుబ్బులూ! ఇలా రావే!" అని పిలిచిన బామ్మ దగ్గరకు చేతిలో కాఫీగ్లాసుతో చేరింది. 'ఎలా ఉన్నావు బామ్మా! నీ ఒంట్లో బాగుంటోందా! ఏమిటిలా హఠాత్తుగా ఊడిపడ్డావు' అంటూ ఆవిడ్ని ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేసేసింది.

"నీకు మొగుణ్ణి తెచ్చానే పిల్లా! రేపు వాళ్ళు నిన్ను చూడ్డానికి వస్తున్నారు. ఎటూ పోకు" అంటూ బోసి నోటితో నవ్వింది బామ్మ.

పో! బామ్మా! ఎప్పుడూ నీకు అదే ధ్యాస. బి. ఏ అయితేగాని పెళ్ళి చేసుకోనులంటూ బుంగమూతి పెట్టింది సుబ్బులు ఉరఫ్ సుబ్బలక్ష్మి. ఇంతలో స్నేహితురాలి రాకతో సినిమాకి జారుకుంది సుబ్బులు.

ఏం రోజులో మరీను! అంటూ మనసులో నొచ్చుకుంది, సుబ్బలక్ష్మి బామ్మ.

* * *

మర్నాడు కూడా సుబ్బులు అలాగే వాదించినా అందరూ పెళ్ళి చూపుల హడావుడిలో పడి సుబ్బులు మాటలు పట్టించుకోకుండా పెళ్ళిచూపులు ఏర్పాటు చేసేశారు. బామ్మ సాధింపులకి, తండ్రికి జడిసి, గునుస్తూనే పెళ్ళిచూపులకి కూర్చుంది సుబ్బలక్ష్మి.

మధ్యాహ్నం పెళ్ళివారు సుబ్బలక్ష్మిని చూడ్డానికి వచ్చారు. పెళ్ళికొడుకు ప్రభాకరం ఆ ఊళ్ళోనే ఉన్న ఓ బ్యాంకులో ఆఫీసరు.

కాఫీ ఫలహారాలయ్యాయి. "అమ్మాయి నేమన్నా ప్రశ్నలడుగుతే అడుగు, బాబూ" అని ప్రభాకరానికి ఓ చిన్న అవకాశం ఇచ్చింది సుబ్బలక్ష్మి బామ్మ.

ఎదురుగా కుర్చీలో ముళ్ళమీదున్నట్లు కుంచించుకుపోయి. తల దించుకు కూర్చున్న సుబ్బలక్ష్మి బామ్మమీద పళ్ళు నూరుతుంది.

"మీరు పెళ్ళైనాక కాలేజీలో చేరదామనుకుంటున్నారా!" అని నెమ్మదిగా సుబ్బలక్ష్మిని ప్రశ్నించాడు ప్రభాకరం.

కొద్దిగా జంకు, బిడియం అభినయిస్తూ సుబ్బలక్ష్మి కంగారుతో అవునన్నట్లు తల పంకించింది.

"అమ్మాయి! ఇంక నువ్వు లోపలికి వెళ్ళమ్మా! చూడ్డానికి వచ్చిన [illegible] మాటలతో పరీక్ష హాల్లోంచి అరగంట అయిన వెంటనే బయటపడే స్టూడెంట్లా లేచింది. లోపలికి వెళ్ళబోతూ కుతూహలం ఆపుకోలేక నెమ్మదిగా తల ప్రక్కకి తిప్పి వాలుగా కళ్ళతో ఓసారి పెళ్ళికొడుకుని చూసిన సుబ్బలక్ష్మి ఆ క్షణంలోనే మనసు పారేసుకుంది.

తరువాత ఏమే! పిల్లా! పెళ్ళికొడుకు నచ్చాడా!" అన్న బామ్మ మాటలకు సుబ్బులు మాట్లాడకుండా లోపలికి పారిపోయింది. సంగతి అర్థమయిన బామ్మ ముసిముసిగా నవ్వుకుంది.

* * *

అన్నట్లు గ్రాడ్యుయేట్ అమ్మాయి అయితే తప్ప పెళ్ళిచేసుకోనని భీష్మించుకు కూర్చున్న ప్రభాకరం కూడా ఇంక నుంచి ఇదే స్థితిలో ఉండటంచేత ఎక్కువ ఆలస్యం కాకుండా దగ్గర్లోని ఓ శుభ ముహూర్తాన సుబ్బలక్ష్మి శ్రీమతి ప్రభాకరం అయిపోయింది.

"ఇంకా ఆలస్యం ఎందుకు! మిగతా తతంగం కూడా ఇప్పుడే కానిచ్చేద్దాం" అంది మగ పెళ్ళివారితో సుబ్బలక్ష్మి బామ్మ. ఆవిడ కేసి కృతజ్ఞతగా చూశారు నవదంపతులు.

ఆ రోజు గదిలోకి వెళుతున్న ప్రభాకరానికి ప్రక్కగది కిటికీలో అలంకరించుకొని ఉన్న సుబ్బలక్ష్మి కనబడింది. అతడిని చూసి పలకరింపుగా ఓ చిరునవ్వు నవ్వింది.

ఓ గంట తర్వాత సుబ్బలక్ష్మిని లోపలికి పంపించి అందరూ తప్పుకున్నారు.

అందంగా సిగ్గుపడుతూ తలుపు దగ్గరే నిలుచుంది తాను చూసిన సినిమాల్లో హీరోల్లా వచ్చి మంచం దగ్గరకు తీసుకెళ్ళే సీను కలల్లో ఊహించుకుంటున్న సుబ్బులు ఎంతసేపటికీ ప్రభాకరం నుంచి స్పందన రాకపోయేటప్పటికి కొంచెం తల యెత్తి చూసింది. "సుబ్బలక్ష్మీ! ఇలా రా! ఇలా కూర్చో" అన్నాడు." టేబులుకటువైపు కూర్చున్న ప్రభాకరం.

అనుకోని ఈ హఠాత్పరిణామానికి సుబ్బలక్ష్మి ఆశ్చర్యపోతూ వచ్చి తలదించుకుని ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చొంది.

బ్యాంకులో క్రొత్తగా రిక్రూట్ అయిన వాళ్ళని పిలిచి రోజూ లెక్చర్లివ్వడం అలవాటయిన ప్రభాకరానికి ఇలా పూలజడ పట్టుచీర అలంకారంతో సిగ్గుపడే కేండిడేటు బ్యాంకులో ఎవరు తారసపడలేదేమో కొంచెం తడబడ్డాడు.

ఆఫీసరు హోదాలో ఒకసారి గొంతు సవరించుకొని చిన్నగా దగ్గాడు. అయినా సుబ్బులులో [illegible] చలనం కనుపడటం లేదు.

"సుబ్బలక్ష్మీ! తలెత్తి ఇటు చూడు! నువ్వు ఇవ్వాళనుంచి ఈ ఏడాదిపాటు అంటే నీ గ్రాడ్యుయేషన్ పూర్తి అయ్యేవరకు ప్రొబేషన్‌లో వుంటావు. అంటే ఇంకా స్టూడెంట్ వేనన్నమాట తెలిసిందా. ఈ లోపుగా నీ గ్రాడ్యుయేషన్ పూర్తి కావాలి. అసలు గ్రాడ్యుయేట్ అమ్మాయినే చేసుకుందామనుకున్నాను. ఇంతలో నిన్ను చూడటం .. అదీ కథ" అని మామూలు స్టేజీలోకి దిగిపోతున్న ప్రభాకరాన్ని లోపలి ఆఫీసరు నిలబెట్టాడు.

ఆ రోజు పెళ్ళి చూపులనాడు నే అడిగినప్పుడు కూడా ఇలాగే మౌనంగా సమాధానం చెప్పావు. నీ బి. ఏ. పూర్తి అయ్యేదాకా అలాగే తక్కువగా మాట్లాడుతూండు" అన్నాడు ప్రభాకరం.

[illegible] తల ఎత్తి చూసింది సుబ్బులు.

కళ్ళతో చిలిపిగా నవ్వాడు ప్రభాకరం.

త్వరలో

## శ్రీ నిమ్మగడ్డ వెంకటేశ్వరరావ్

చలం సాహిత్యంపై.

సంచలనాత్మక వ్యాస పరంపర

# స్మశాన సాహిత్యం

లేక

# చలం నిజస్వరూపం

ఆ నవ్వుకు పరవశమైపోయింది సుబ్బులు. తర్వాత గదిలో లైటారిపోయింది.

ఆదివారాలు, శెలవురోజుల్లో ప్రభాకరం అత్తగారింటికి వస్తూండేవాడు. రెణ్ణెళ్ళ తర్వాత ఓ ఆదివారం ప్రొద్దున వచ్చిన ప్రభాకరం హాల్లో కుర్చీలో కూర్చుని పేపరు చూస్తున్నాడు. బి. ఏ. పార్టు రిజల్ట్సు చూసి సుబ్బులు నంబరు కోసం ఆత్రంగా వెతికాడు.

ఇంతలో చేతిలో కాఫీ గ్లాసుతో వచ్చింది" సుబ్బులు. "సందేహం తీర్చుకొందామని సుబ్బులూ! నీ నంబరెంత"ని పేపరిచ్చాడు.

పరీక్షలయిం తర్వాత మళ్ళీ అవ్వాళవరకు దాని గురించే ఆలోచించని సుబ్బులు గుండెలు ఒక్కసారి వేగంగా కొట్టుకున్నాయి.

పేపరు రెండుచేతులతో లాక్కొని నంబరు కోసం ఆత్రంగా వెతికింది.

తెలుగులో పోయిందండీ" అంటూ పేపరు ప్రక్కన పడేసి ప్రభాకరం ప్రక్కనున్న కుర్చీలో కూలబడింది సుబ్బులు.

"పోనీలే! సెప్టెంబరులో చూద్దాం!" అని ఓదార్చాడు ప్రభాకరం. సినిమా ప్రోగ్రాం

వేసుకువచ్చిన అతడు ఫోంచేసి వసుందని వెళ్ళిపోయాడు.

* *

సుబ్బులు కాలేజీ తెరిచారు. పుట్టింట్లో ఉండే థర్డియర్ కాలేజీకి వెళ్ళి వస్తూండేది. ఇంతలో ప్రభాకరం చెల్లెలి పెళ్ళి కూడా అదేడాళ్ళో జరగడంతో, ఆ పెళ్ళిలో ప్రభాకరం సుబ్బులులదే హడావుడి అంతా. ఎంతో మౌనంగా ఉండే సుబ్బులు పెళ్ళిలో చనువుగా తిరుగుతూ, మరదలిని వేళాకోళం పట్టిస్తూ భర్తనుకూడా ఓ ఆట పట్టించసాగింది, ఇన్నాళ్లు ప్రభాకరం మాట్లాడుతుంటే ఆరాధనగా సుబ్బులు అతనికేసే చూస్తూ వింటూండేది, ఇప్పుడు సుబ్బులు మాటలతో ఆడిస్తుంటే వినడం ప్రభాకరం వంతయింది.

ఓ రోజు ఎవరూ లేకుండా చూసి ప్రభాకరం గదిలోకి ఒంటరిగా చేరింది సుబ్బులు.

"మిమ్మల్ని ఒదిలి ఒక్క_రాత్రినీ ఉండలేక పోతున్నాను." అని గునుస్తూ "అసలే మీకా హోటల్ తిండి పడదు. హాయిగా మీ దగ్గరుండే కాలేజీకి వెడుతుంటాను" అని అస్త్రం ప్రయోగించింది.

అప్పుడు ఏ కళనున్నాడో ప్రభాకరం ఏమనకుండా ఒప్పుకున్నాడు. పదిహేను రోజుల్లో ఓ శుభ ముహూర్తాన సుబ్బులు క్రొత్త కాపురం మొదలయింది. దంపతుల సరాగాలతో క్రొత్త సంసారం కాలంతో పోటీపడి ఒక కేలండరు కాగితాల్ని ఇట్టే తిప్పేసింది. సుబ్బులు కాలేజీకి ప్రిపరేషన్ హాలీడేసిచ్చేశారు.

ఏమధ్యాహ్నమో ప్రభాకరం మొదటి రోజున ఘాటుగా ఇచ్చిన లెక్చరు గుర్తుకు వచ్చినపుడు సుబ్బులు పుస్తకం పట్టుకు కూర్చొనేది. అలా కూర్చొన్న సుబ్బులు చేతిలో పుస్తకం, ఏ ప్రోగ్రామో వేసుకు వచ్చిన ప్రభాకరం హడావుడిలో మళ్ళీ రాక్‌లో కెక్కేది. మళ్ళా నాలుగు రోజుల దాకా ఆ పుస్తకం జోలికి పోయేది కాదు.

నెమ్మదిగా సుబ్బులు ఫైనలియర్ పరీక్షలయిపోయాయి. హాయిగా పుస్తకాలను కట్ట కట్టి అటక ఎక్కించేసింది సుబ్బులు.

ఓ రెండ్నెల్ల తరువాత రిజల్ట్సు వచ్చాయి. ప్రభాకరం పేపరులో హడావిడిగా సుబ్బులి నంబరుకోసం ఆత్రుతగా వెతికి–"సుబ్బులు నీ పరీక్ష...." బాత్‌రూములోకి పరిగెత్తిన సుబ్బుల్ని చూసి అలాగే అవాక్కయిపోయాడు.

మొహం కడుక్కు వచ్చిన సుబ్బుల్ని చూసి, "ఏం ఒంట్లో బాగులేదా!అన్నాడు.

ముఖం సిగ్గుతో ఎర్రబడగా పెదిమలతో నవ్వు బిగిస్తూ సుబ్బులు లోపలికి పరిగెత్తింది.

ప్రభాకరం అయోమయంగా చేతిలో పేపరు వంక చూస్తూ ఈజీచైర్‌లో కూలబడ్డాడు.

మరికొన్నాళ్ళకి సుబ్బులు ప్రభాకరాన్ని ఒంటరిగా వదిలేసి పుట్టింటికివెళ్ళిపోయింది.

* * *

తర్వాత మళ్ళీ సుబ్బులు మాస్టర్ ప్రభాకరంతో చేరుకొంది. ఆ రోజు రాత్రి "సుబ్బులూ! మళ్ళీ పరీక్షకికడతావా!" అని అడిగాడు ప్రభాకరం.

సమాధానంగా చేతిలో అబ్బాయిని ప్రభాకరానికి అందించింది–పాలు కలిపే నెపంతో ప్రక్కగదిలోకి జారుకొంది సుబ్బులు.

తరువాత రెండుమూడు సార్లు ఇలాగే కదిపి చూచినా జవాబు చెప్పకుండా జారుకోడంతో ప్రభాకరం ఒళ్లు మండి అటక మీద పుస్తకాలు ప్రక్కవాటాలో వాళ్ళ అబ్బాయికి దానం చేసేశారు. ★

